అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 345 | వరంగల్ | గురువారం, 29 అక్టోబర్ 2026 | పేజీలు: 07



గుండెలనిండా కాంగ్రెస్ జెండా..

కష్టాలెదురైనా.. పార్టీనే నమ్ముకున్న నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానం..

ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలంటున్న 60కి పైగా కుల, ప్రజా సంఘాలు

విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌తో అనుబంధం..

పేదలకు వైద్యం, విద్యార్థులకు అండ..

సామాజిక ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర




5

విద్యార్థి దశలో పట్టుకున్న కాంగ్రెస్ జెండాను రెండున్నర దశాబ్దాలుగా భుజాన మోస్తూ.. రాజకీయ ఒడిదుడుకులు ఎదురైనా పార్టీతోనే అడుగులు వేస్తూ.. మరోవైపు పేదల కన్నీళ్లు తుడుస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ప్రస్థానం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పదవులకతీతంగా ప్రజలతో మమేకమవుతూ, వైద్య సేవలను సామాజిక బాధ్యతగా మలుచుకున్న ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇందుకు నిదర్శనంగా 60కి పైగా కుల, ప్రజా సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఏకగ్రీవ తీర్మానం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. దశాబ్దాల పార్టీ సేవకు గుర్తింపు.. సామాజిక సేవా ప్రస్థానానికి గౌరవం.. ప్రజా జీవితంలో మరింత బాధ్యతాయుత పాత్రకు అవకాశం.. ఈ మూడు అంశాలతో రామకృష్ణకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలనే విజ్ఞప్తి ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చకు తెరలేపింది. కష్టాలెదురైనా.. కాలం మారినా.. కాంగ్రెస్‌నే నమ్ముకున్న నాయకులకు సముచిత స్థానం ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రామకృష్ణకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మొత్తం 30మంది లేఖలు అందజేసినట్లు తెలిసింది.

- అక్షరశక్తి, హనుమకొండ







పేదల గుడిసెల జోలికొస్తే ఊరుకోం!

- కాజీపేట వైఎస్సార్ నగర్ వాసులకు అండగా జనసేన నాయకురాలు డాక్టర్ పద్మజాదేవి
- 150 కుటుంబాలకు భరోసా.. 15 ఏళ్ల నివాసానికి ఆధారాలున్నా తొలగింపులెందుకు?
- ఇదే స్థలంలో పట్టాలిచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్
- రాజకీయం ముసుగులో స్థలాల కబ్జాకు యత్నిస్తున్నారంటూ ఆరోపణ



పేదల గుడిసెలను కూల్చివేసి వారిని నిరాశ్రయులను చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాదం పద్మజాదేవి స్పష్టం చేశారు. *- అక్షరశక్తి, కాజీపేట*

4

స్వీట్ల తయారీలో ఫేషియల్ రోజ్‌వాటర్!

- వరంగల్, హనుమకొండలో టీజీ సేఫ్ ఆకస్మిక తనిఖీలు
- 9 ఆహార తయారీ కేంద్రాల లైసెన్సులు సస్పెండ్.. యూనిట్ల మూసివేత
- కుళ్లిన బంగాళాదుంపలు, బూజుపట్టిన అల్లం..
- చక్కెర పాకంలో చనిపోయిన దోమలు
- రూ.5.41 లక్షల విలువైన 5,045 కిలోల ముడి సరుకు సీజ్



ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన తయారీ కేంద్రాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వైనం వెలుగుచూసింది. స్వీట్ల తయారీలో ముఖానికి రాసుకునే ఫేషియల్ రోజ్‌వాటర్‌ను వినియోగించడం, చక్కెర పాకంలో చనిపోయిన దోమలు కనిపించడం, చిప్స్ తయారీకి కుళ్లిన బంగాళాదుంపలు ఉపయోగించడం వంటి తీవ్ర ఉల్లంఘనలను టీజీ సేఫ్ (తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత విభాగం) అధికారులు గుర్తించారు. *- అక్షరశక్తి, హనుమకొండ*

6

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు గాదం సహదేవ్



అక్షరశక్తి, హనుమకొండ: భీమారం గ్రామానికి చెందిన క్రీడాకారుడు గాదం సహదేవ్ జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో హనుమకొండ జిల్లా 55వ డివిజన్ భీమారానికి చెందిన సహదేవ్ పాల్గొని, 74 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచారు. దీంతో ఆయన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కన్నూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి ఆల్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సహదేవ్ 74 కిలోల విభాగంలో పోటీపడనున్నారు. ఈ సందర్భంగా నేషనల్ పవర్‌లిఫ్టింగ్ జిమ్ కోచ్ సంఘాల కమలాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుడు ఆకుల కుమార్ సహదేవ్‌ను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎల్‌నినో, సీజనల్ వ్యాధులపై కళా ప్రదర్శన

- **పరకాల బస్టాండ్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల అవగాహన కార్యక్రమం**



అక్షరశక్తి పరకాల: హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజాసంబంధాల అధికారి ఆదేశాల మేరకు ప్రజల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. అక్టోబర్ 28న పరకాల బస్టాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, సీజనల్ వ్యాధుల నివారణతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వాటి వల్ల ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తంగా ఉండాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఇళ్లలో ఉత్పత్తయ్యే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడటం వంటి అంశాలను కళాకారులు తమ ప్రదర్శన ద్వారా వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా తదితర వ్యాధుల ముప్పును తగ్గించవచ్చని తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఆరు గ్యారంటీలపై కళారూపంలో ప్రచారం

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు తెలియజేస్తూ, వాటి లక్ష్యాలు, ప్రయోజనాలను కళాకారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జ్యోత్స్న కళాబృందానికి చెందిన కళాకారులు రాజేశ్వరి, మధు, సంధ్య, రమేష్ తదితరులు పాల్గొని తమ ప్రదర్శనల ద్వారా ప్రజలకు సందేశాన్ని అందించారు.

శ్రీధరాచార్యులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం



అక్షరశక్తి, వరంగల్: ప్రముఖ వ్యాఖ్యాత మరియు గాయకులు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఠంయ్యాల శ్రీధరాచార్యులను జడ్ పి ఎస్ ఎస్ చెన్నారం ఉపాధ్యాయ బృందం, మం:వర్ధన్నపేట, జిల్లా:వరంగల్ సన్మానించింది.జడ్ పి ఎస్ ఎస్ జి హెచ్ ఎమ్ సమ్మిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భముల్ ఠంయ్యాల వ్యాఖ్యాతగా గాయకుడిగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాఠశాల పక్షాన శ్రీధరాచార్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి హెచ్.కనకయ్య,సి హెచ్. వేణు,హెచ్ సుమతి,ఏ. సతీష్,పి అనిల్ కుమార్ ,టి. దయాకర్ నుస్రత్ జహత్ తదితరులు ఠంయ్యాలను సన్మానించారు.

సృజనాత్మకతకు వేదిక 'టెక్నోజియన్' సాంకేతిక భవితకు ఎన్ఐటీ వరంగల్ బాటలు



తరగతి గది నాలుగు గోడల మధ్య నేర్చుకునే సిద్ధాంతాలకు, వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లకు మధ్య వారధిగా నిలిచేదే సాంకేతిక ఆవిష్కరణ. ఇంజినీరింగ్ విద్యార్థుల్లోని పరిశోధనా తృష్ణను, సరికొత్త ఆలోచనలను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను తీర్చిదిద్దే లక్ష్యంతో మా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ ప్రాంగణంలో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్నదే వార్షిక సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియన్' (Technozion).

ప్రారంభం – ప్రస్థానం:

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద విద్యార్థి సాంకేతిక ఉత్సవాల్లో ఒకటిగా పేరుగాంచిన 'టెక్నోజియన్' 2006లో ప్రారంభమైంది. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను వెలికితీయడం, పరస్పర ఆలోచనల మార్పిడిని ప్రోత్సహించడం, పాఠ్యపుస్తకాల పరిజ్ఞానానికి మించి అత్యాధునిక ఆవిష్కరణలతో వారిని అనుసంధానించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయాణంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను, పరిశోధనా ఫలితాలను ప్రదర్శించారు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో వందలాది విద్యార్థి ప్రాజెక్టులు స్టార్టప్‌లుగా, సమాజోపయోగ నమూనాలుగా రూపుదిద్దుకోవడానికి ఈ వేదిక దోహదపడింది. అనుభవాధారిత అభ్యాసం (Experiential Learning), విభిన్న విభాగాల మధ్య సహకారం (Interdisciplinary Collaboration), భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన ప్రతిభను తీర్చిదిద్దడంలో ఎన్ఐటీ వరంగల్ నిబద్ధతకు టెక్నోజియన్ అద్దం పడుతోంది.

రేపటి నుంచి ఘనంగా 'టెక్నోజియన్ '26':

ఈ ఏడాది సాంకేతిక పండుగ 'టెక్నోజియన్ '26' అక్టోబర్ 30, 31 తేదీల్లో క్యాంపస్‌లో అట్టహాసంగా జరగనుంది. అక్టోబర్ 30వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఇన్‌స్టిట్యూట్‌లోని అకడమిక్ లెర్నింగ్ సెంటర్ (ALC)లో ఈ వేడుకలు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఒలెక్ట్రా వైస్ ప్రెసిడెంట్ (ఇన్నోవేషన్ & స్ట్రాటజీ పార్ట్‌నర్‌షిప్), అతుల్ ఆటో ఇండిపెండెంట్ డైరెక్టర్, ఏఆర్ఏఐ (ARAI) మాజీ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్, ఈవీ నిపుణుల బృంద సభ్యుడు శ్రీ కమల్ కిషోర్ పోరా హాజరుకానున్నారు. ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి విశిష్ట అతిథిగా పాల్గొని మార్గదర్శనం చేయనున్నారు.

50కి పైగా కార్యక్రమాలతో సాంకేతిక సంబరం

రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ ఔత్సాహికులు, ఆవిష్కర్తలు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా:

- 50కి పైగా వినూత్న సాంకేతిక పోటీలు
- విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టే రోబోటిక్స్ పోటీలు
- సరికొత్త వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించే 'స్టార్టప్ ఛాలెంజ్'
- సైబర్ భద్రతపై ప్రతిభను పరీక్షించే 'సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్'
- అత్యాధునిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించే వర్క్‌షాప్‌లు, టెక్నాలజీ ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ఈ మహోత్సవాన్ని ఎన్ఐటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (SAC) ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్ (డీన్, స్టూడెంట్ వెల్ఫేర్), ప్రొఫెసర్ వెలగపూడి వాసు (ప్రెసిడెంట్, ఎస్ఏసీ), ప్రొఫెసర్ వెంకన్న ఉడుతలపల్లి (వైస్ ప్రెసిడెంట్, టెక్నికల్) పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. విద్యార్థి మండలి టెక్నికల్ సొసైటీ కార్యదర్శి ధీరజ్ బి., సంయుక్త కార్యదర్శి విష్ణు వర్ధన్ నేతృత్వంలో విద్యార్థి బృందం సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేసింది. పూర్తి సమాచారం, తాజా అప్‌డేట్ల కోసం అధికారిక వెబ్‌సైట్ technozion.nitw.ac.in ను సందర్శించవచ్చు. సాంకేతికతతో సరికొత్త సమాజాన్ని నిర్మించే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాం.



- పూజిత బొమ్మిళ్ల
(ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థిని, ఎన్ఐటీ వరంగల్)

నరకాసుర వధకి పకడ్బందీ ఏర్పాట్లు

- **అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



అక్షరశక్తి, వరంగల్: దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6, 2026న వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నరకాసుర వధ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు, నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేసి, కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, డీఎంహెచ్‌వో రాజిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మారుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మారుపల్ల గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

బోనంతో నిరసన

- హెచ్ఎం ఉద్యోగుల నిరసనలు
- 17వ రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె

అక్షరశక్తి, వరంగల్: పోచం మైదాన్ సర్కిల్ లో గురువారం నాటికీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె 17 వ రోజు కు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు బోనం ఎత్తుకొని నిరసన తెలుపుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ తెలంగాణ రాష్ట్రంలో 78 క్యాడర్లో సుమారు 17,541 మంది పనిచేస్తున్నారని వీరందరికీ కూడా తక్షణమే రెగ్యులరైజేషన్ తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య భద్రత, ఇన్సూరెన్స్, మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు, 100% గ్రాస్ శాలరీ, సమాన పనికి సమాన వేతనం, లోయాల్టీ బోనస్, మరియు తదితర 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో భాగంగా పోచమ్మ తల్లి సమస్యలతో కూడిన డిమాండ్లు పరిష్కరించాలని తల్లి దగ్గర డిమాండ్ పత్రాలు పెట్టడం జరిగింది. ఉద్యోగులు ఆకర్షించడానికి మరియు తమ ఆవేదనను తెలపడానికి బోనాలు ఎత్తుకొని ప్రత్యేకంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ



ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , ఆర్ బి ఎస్ కే రాష్ట్ర ఆర్గనైజర్ డాక్టర్ గుండా రవీందర్ డాక్టర్. హరికృష్ణ ,డాక్టర్ రామ్ రాజు ,డాక్టర్. యశస్విని, డాక్టర్.అనిత,డాక్టర్ మధు,డాక్టర్ సునీత దేవి,డాక్టర్ నిఖిల్, హారిక, ఈవిన్ మేనేజర్ రవీందర్, డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్ , నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న సుమలత, కళ్యాణి, సుమలత, సుష్మ, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్ , సంతోష్, శివకుమార్, తీగల సతీష్ కుమార్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెల్, వైకుంఠం , టీబీ డిపార్ట్మెంట్ రంజిత్ , రాకేష్, అకౌంటెంట్స్ ఆచంట అభిషేక్ , శ్వేత , శ్రీనివాస్ బాబు, ప్రేమలత ,మౌనిక ఏ.ఎన్.ఎం.లు దాసరి నర్మదా, సంధ్య, జ్యోతి ,సుల్తానా , పేనీన, ఉప్పలమ్మ, నర్మద, రాజేశ్వరి, ప్రభావతి, అనిత ,శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు జూకంటి మౌనిక, ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి , బండి రాజేష్, అజ్మీర్ విజయ నాయక్, కలవల్ల కుమార్ , సపోర్టింగ్ స్టాఫ్ గూడెపు ప్రభాకర్, రజియా మరియు తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యే

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తెలుసుకోవాలి.
మంత్రి దనసరి అనసూయ సీతక్క

అక్షరశక్తి,ములుగు: ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యేనని, విద్యార్థులు ఆసక్తితో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావు పేట మండలం పసర జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో చదువు, జ్ఞానం మనకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఎలాంటి కష్టాలు ఎదురైనా విద్యావంతులు తమ జ్ఞానంతో ఉపాధి పొందుతూ స్వశక్తితో జీవించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, తాము సంపాదించిన జ్ఞానాన్ని పది మందికి పంచాలని సూచించారు. ఇతరులకు జ్ఞానాన్ని అందించడంలో సంతృప్తి ఉంటుందని,



ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పాఠశాలల్లో, బస్సులు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు, ఇళ్లు, పరిసరాల్లో ఎదురయ్యే వివిధ రకాల వేధింపులను గుర్తించేలా విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఇలాంటి విషయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు తమ రక్షణకు సంబంధించిన అంశాలనూ తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణా నివారణతోపాటు బాలల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడే బొమ్మ ద్వారా 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' గురించి ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత,ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే వీక్‌లో సైకిల్ ర్యాలీ

అక్షరశక్తి, గూడూరు: పోలీస్ ఫ్లాగ్ డే వీక్‌ను పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పోలీసుల బాధ్యతలపై అవగాహన కల్పించడం కార్యక్రమ ఉద్దేశమని అధికారులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ, నేరాల నియంత్రణలో పోలీసుల సేవలు కీలకమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో సీఐ వర్స వినయ్ కుమార్, ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గంజాయికి దూరంగా ఉండాలి



అక్షరశక్తి, హనుమకొండ: యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బీజేవైఎం హనుమకొండ జిల్లా మీడియా కన్వీనర్ చీర్లవంచ శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతినడంతో పాటు విద్య, ఉద్యోగం, కుటుంబ సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఐక్యత సందేశంతో వాక్ అండ్ రన్

- అక్టోబర్ 31న ఉదయం 6 గంటలకు ప్రారంభం: వరంగల్ సీపీ ఎన్. శ్వేత

అక్షరశక్తి, హనుమకొండ: సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఏక్తా దివస్-జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా, విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 31న 5కే, 10కే వాక్ అండ్ రన్ నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి మట్టేవాడ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడంతో వాక్ అండ్ రన్ ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు పాల్గొనవచ్చని సీపీ తెలిపారు. వాక్ అండ్ రన్‌లో విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ఐక్యత, ఐకమత్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.





పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

అక్షరశక్తి, పరకాల: బాలలపై లైంగిక నేరాల నివారణ, బాధితులకు న్యాయం అందించడంలో పోక్సో చట్టంపై అవగాహన కీలకమని పరకాల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. సాయి శరత్ అన్నారు. సురక్షిత బచ్పన్ అభియాన్ ఫ్యాన్ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం పరకాలలోని బిట్స్ పాఠశాలలో పోక్సో చట్టం-2012పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని, బాలికలతో పాటు బాలురకూ సమాన రక్షణ కల్పిస్తుందని తెలిపారు. నేర తీవ్రతను బట్టి నిందితులకు కఠిన శిక్షలు విధించే నిబంధనలు ఉన్నాయని వివరించారు. పిల్లలపై లైంగిక నేరాలు జరిగినట్లు తెలిసినప్పుడు పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించడం తప్పనిసరని పేర్కొన్నారు. బాలల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, అత్యవసర సహాయం కోసం 112 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను విద్యార్థులు బాధ్యతాయుతంగా వినియోగించాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యుడు ఒంటేరు రాజమౌళి, పరకాల ఎస్ఐ పి. పవన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాధుల నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్లదే కీలక పాత్ర

పరీక్షల్లో ఖచ్చితత్వం పాటించాలి



అక్షరశక్తి, వరంగల్: మలేరియా వంటి కీటక జనిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో చికిత్స అందించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని జిల్లా మలేరియా అధికారి రజని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి ఆదేశాల మేరకు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు పునశ్చరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను నాణ్యతా ప్రమాణాల ప్రకారం సేకరించాలని సూచించారు. నమూనాలను సరైన పద్ధతిలో స్టెయిన్ చేసి, మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించి వ్యాధిని ఖచ్చితంగా నిర్ధారించాలని తెలిపారు. పరీక్షల ఫలితాల్లో నాణ్యత, ఖచ్చితత్వం, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైన సందర్భాల్లో నమూనాలను నాణ్యతా తనిఖీ కోసం ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపాలని సూచించారు. సెంట్రల్ మలేరియా ల్యాబొరేటరీలో శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు రక్త నమూనాల సేకరణ, స్టెయినింగ్ పద్ధతులు, మైక్రోస్కోపిక్ పరీక్షలు, మలేరియా పరాన్నజీవుల గుర్తింపు, నాణ్యతా నియంత్రణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ కె. కుమారస్వామి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పి. సదానందం, డిప్యూటీ జిల్లా విస్తరణ, మాస్ మీడియా అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, మలేరియా విభాగం సిబ్బంది, వివిధ ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో రక్తదానం



అక్షరశక్తి, వరంగల్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మామునూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పోలీసులు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ శిబిరంలో రక్తదాతలను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఐపీఎస్, మామునూరు ఏసీపీ వెంకటేష్, గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, డివిజనల్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి సర్పంచ్

రేవూరి సమక్షంలో బండి రేణుక శంకర్ చేరిక

అక్షరశక్తి, నడికూడ: హన్మకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో గురువారం ఆమెతో పాటు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. బండి రేణుక శంకర్‌తో పాటు బండి శివకృష్ణ, శరత్, రామస్వామి, నితిన్, సుమన్, గణేష్, రమాకాంత్ తదితరులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు.







పేదల గుడిసెల జోలికొస్తే ఊరుకోం!

- **కాజీపేట వైఎస్సార్ నగర్ వాసులకు అండగా జనసేన నాయకురాలు డాక్టర్ పద్మజాదేవి**
- **150 కుటుంబాలకు భరోసా.. 15 ఏళ్ల నివాసానికి ఆధారాలున్నా తొలగింపులెందుకు?**
- **ఇదే స్థలంలో పట్టాలిచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్**
- **రాజకీయం ముసుగులో స్థలాల కబ్జాకు యత్నిస్తున్నారంటూ ఆరోపణ**



అక్షరశక్తి, కాజీపేట, అక్టోబరు 29 : పేదల గుడిసెలను కూల్చివేసి వారిని నిరాశ్రయులను చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాదం పద్మజాదేవి స్పష్టం చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట వైఎస్సార్ నగర్‌లో గుడిసెల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఆమె గురువారం కాలనీని సందర్శించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్న కాలనీలోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదల నివాసాలను బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నిస్తే జనసేన పార్టీ తరఫున అండగా నిలిచి పోరాడుతామని భరోసా ఇచ్చారు.

మూడు దశాబ్దాలుగా నివాసం.. ఇప్పుడు తొలగింపులెందుకు?

కాజీపేట వైఎస్సార్ నగర్‌లో సుమారు 150 పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని, గత 15 ఏళ్లుగా ఆధార్, ఓటరు, రేషన్ కార్డులతో పాటు ఇంటి నంబర్లు కూడా కలిగి ఉన్నామని కాలనీవాసులు పద్మజాదేవి దృష్టికి తీసుకువచ్చారు. కోట్లాది రూపాయల విలువైన సుమారు ఐదు ఎకరాల స్థలంపై కొందరు కన్నేసి, రాజకీయ నాయకులు, అధికారుల అండతో తమ నివాసాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆమెను కోరారు.

పేదలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

కాలనీవాసుల సమస్యలను విన్న డాక్టర్ పద్మజాదేవి.. ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలను నిరాశ్రయులను చేయడం తగదని అన్నారు. రాజకీయ ముసుగులో కొందరు అక్రమార్కులు విలువైన స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేదల నివాసాల తొలగింపును నిలిపివేసి, వారి జీవన భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు అదే స్థలంలో పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పృథ్వీ, నరేష్, కాలనీ మహిళలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఆద్రికరాజ్‌కు రజతం

- **రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన హనుమకొండ విద్యార్థిని**



అక్షరశక్తి, హనుమకొండ: రాష్ట్రస్థాయి తాంగ్‌తా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో హనుమకొండకు చెందిన విద్యార్థిని అర్సం ఆద్రిక రాజ్ రజత పతకం సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్ జిల్లా షేక్‌పేటలో నిర్వహించిన అండర్-14 విభాగం, 37 కిలోల కేటగిరీ పోటీల్లో వరంగల్ జిల్లా తరఫున ఆమె పాల్గొని ప్రతిభ కనబరిచింది. హనుమకొండ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆద్రిక రాజ్ ప్రత్యర్థులతో పోటీపడి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చేతుల మీదుగా పతకాన్ని అందుకుంది.

ఈ సందర్భంగా ఆద్రిక రాజ్ మాట్లాడుతూ.. తన అమ్మ, తాతయ్య, తల్లి అందించిన ప్రోత్సాహం, కోచ్ తిరుపతి సహకారంతో ఈ విజయాన్ని సాధించినట్లు తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకొస్తానని ధీమా వ్యక్తం చేసింది. ఆద్రిక సాధించిన విజయంపై పలువురు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నూతన కలెక్టరేట్‌ను త్వరగా ప్రారంభించాలి

- **జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల నాయకుల వినతి**



అక్షరశక్తి, వరంగల్: నూతనంగా నిర్మించిన వరంగల్ జిల్లా కలెక్టరేట్ భవనాన్ని త్వరగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ప్రస్తుత కలెక్టరేట్ హనుమకొండలో ఉండటంతో సుదూర గ్రామాల నుంచి వచ్చే నిరుపేదలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని వసతులతో నిర్మాణం పూర్తయిన నూతన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభిస్తే ప్రజలకు పాలనా సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే సామాజిక న్యాయవేదిక వ్యవస్థాపకుడు కేడల ప్రసాద్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ వరంగల్ ఇన్‌చార్జి ఐతం నగేష్, రజక రిజర్వేషన్ సమితి నాయకుడు చాపర్తి కుమార్ గాడ్డే, మంజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు, వేల్పుగొండ హరినాథ్, పెరుమాళ్ల లక్ష్మణ్, నిలువేరు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెలనిండా కాంగ్రెస్ జెండా..

విద్యార్థి దశలో పట్టుకున్న కాంగ్రెస్ జెండాను రెండున్నర దశాబ్దాలుగా భుజాన మోస్తూ.. రాజకీయ ఒడిదుడుకులు ఎదురైనా పార్టీతోనే అడుగులు వేస్తూ.. మరోవైపు పేదల కన్నీళ్లు తుడుస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ప్రస్థానం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పదవులకతీతంగా ప్రజలతో మమేకమవుతూ, వైద్య సేవలను సామాజిక బాధ్యతగా మలుచుకున్న ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇందుకు నిదర్శనంగా 60కి పైగా కుల, ప్రజా సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఏకగ్రీవ తీర్మానం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. దశాబ్దాల పార్టీ సేవకు గుర్తింపు.. సామాజిక సేవా ప్రస్థానానికి గౌరవం.. ప్రజా జీవితంలో మరింత బాధ్యతాయుత పాత్రకు అవకాశం.. ఈ మూడు అంశాలతో రామకృష్ణకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలనే విజ్ఞప్తి ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చకు తెరలేపింది. కష్టాలెదురైనా.. కాలం మారినా.. కాంగ్రెస్‌నే నమ్ముకున్న నాయకులకు సముచిత స్థానం ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రామకృష్ణకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మొత్తం 30మంది లేఖలు అందజేసినట్లు తెలిసింది.

- అక్షరశక్తి, హనుమకొండ

- కష్టాలెదురైనా.. పార్టీనే నమ్ముకున్న నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ
- రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానం..
- ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలంటున్న 60కి పైగా కుల, ప్రజా సంఘాలు
- విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌తో అనుబంధం..
- పేదలకు వైద్యం, విద్యార్థులకు అండ..
- సామాజిక ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర











విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌తో అనుబంధం

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ రాజకీయ ప్రస్థానం విద్యార్థి దశలోనే ప్రారంభమైంది. ఎన్ఎస్‌యూఐతో మొదలైన ఆయన కాంగ్రెస్ అనుబంధం యూత్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్, ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ తదితర విభాగాల మీదుగా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లోనూ బాధ్యతలు నిర్వహిస్తూ, దేశంలో ఎక్కడ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చినా.. ఆయా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అనేక రాష్ట్రాల్లో ఎలక్షన్ ఇన్‌చార్జిగా కూడా రామకృష్ణ బాధ్యతలు నిర్వర్తించారు. రాజకీయాల్లో ఒడిదుడుకులను తట్టుకొని, అనేక కేసులను ఎదుర్కొంటూ ముందుకు వెళ్తున్నారు. వివిధ స్థాయుల్లో కాంగ్రెస్ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండటం ఆయన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన అంశం. విద్యార్థి దశ నుంచి ప్రారంభమైన ఈ ప్రస్థానం నేటికీ కొనసాగుతుండటంతో పార్టీ పట్ల ఆయనకున్న దీర్ఘకాలిక అనుబంధం చర్చకు వస్తోంది.

వైద్య సేవల నుంచి సామాజిక బాధ్యత వరకు

రాజకీయాలకే పరిమితం కాకుండా వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవ చేయడంపైనా రామకృష్ణ దృష్టి సారించారు. లండన్‌లో ఫిజియోథెరపీ వైద్య విద్యలో స్పెషలైజేషన్ పూర్తి చేసిన ఆయన, తన పరిజ్ఞానాన్ని ప్రజలకు ఉపయోగపడేలా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని నిరుపేదలకు సహాయం చేయడంతోపాటు, అవసరంలో ఉన్నవారికి తనవంతు అండగా నిలుస్తున్నారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఎక్కడైనా ఎవరికైనా ఆపద ఎదురైనప్పుడు స్పందించి సహాయం చేయాలనే తపనతో ఆయన పనిచేస్తున్నారని సన్నిహితులు చెబుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించడంలోనూ రామకృష్ణ తనవంతు కృషి చేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో ముందుకు సాగలేని విద్యార్థులకు సహకరిస్తున్నారు. సివిల్స్, గ్రూప్ 1 వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన తోడ్పాటు అందిస్తూ, యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రోత్సహిస్తున్నారు. విద్య ద్వారా సామాజికంగా ఎదిగే అవకాశాలు పెరుగుతాయని భావిస్తూ, విద్యార్థులు, యువతకు అండగా నిలవడం తన సామాజిక బాధ్యతలో భాగంగా కొనసాగిస్తున్నట్లు ఆయన అనుచరులు వివరిస్తున్నారు.

60కి పైగా సంఘాల ఏకగ్రీవ తీర్మానం

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతూ హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 60కి పైగా సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని, ఆయనకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్, ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్ రజక, బీసీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్, న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాదిగ, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు, కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు, ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వైద్య సేవలు, సామాజిక సేవ, పేదల సంక్షేమం, విద్యార్థులకు సహకారం వంటి రంగాల్లో రామకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని వారు కోరారు. వివిధ కులాలు, మతాలు, సంఘాలకు చెందిన ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి మద్దతు ప్రకటించడం ఈ సమావేశానికి ప్రత్యేకతగా నిలిచింది.

వైద్య, సామాజిక సేవా రంగాల్లో

సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, కళలు, సహకార ఉద్యమం, సామాజిక సేవ వంటి రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం లేదా ఆచరణాత్మక అనుభవం కలిగిన వ్యక్తులను శాసన మండలికి నామినేట్ చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైద్య, సామాజిక సేవా రంగాల్లో రామకృష్ణ అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకోవాలని సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం, విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తీరు, వివిధ విభాగాల్లో నిర్వహించిన బాధ్యతలను గుర్తించాలని కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు

రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం వరంగల్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలను కలిసి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించే వరకు తమ సంఘాల తరపున ప్రజాస్వామ్య పద్ధతిలో మద్దతు కొనసాగిస్తామని యాదగిరి గౌడ్, చాపర్తి కుమార్, కేడల ప్రసాద్ పటేల్, సునీల్ మాదిగ, మాదాసి సురేష్, కొమ్ముల బాబు తదితరులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా ప్రస్థానానికి రాజకీయ గుర్తింపు లభిస్తుందా?

రెండున్నర దశాబ్దాల కాంగ్రెస్ అనుబంధం, విద్యార్థి దశ నుంచి సాగుతున్న రాజకీయ ప్రయాణం, వైద్య రంగంలో ప్రత్యేక విద్య, పేదలకు ఉచిత వైద్య సేవలు, విద్యార్థులకు సహకారం, సామాజిక ఉద్యమాల్లో భాగస్వామ్యం.. ఇలా విభిన్న రంగాల్లో తనదైన పాత్ర పోషిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలనే డిమాండ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు ఇవ్వాలనే అంశంతోపాటు, సామాజిక సేవా రంగంలో చేసిన కృషిని రాజ్యాంగబద్ధమైన ప్రమాణాల ప్రకారం పరిశీలించాలనే అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో 60కి పైగా సంఘాల ఏకగ్రీవ తీర్మానం, ఎమ్మెల్యేలకు సమర్పించిన వినతిపత్రాలు తదుపరి పరిణామాలపై ఆసక్తిని పెంచాయి. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అభ్యర్థిత్వంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.







గర్మిళ్లపల్లికి పూలే విగ్రహం అందజేత



అక్షరశక్తి, హన్మకొండ : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను గ్రామగ్రామాన విస్తరించాలనే సంకల్పంతో డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ చేపట్టిన విగ్రహ స్థాపన కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి పూలే విగ్రహాన్ని అందజేశారు. ఆర్ట్స్ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు గురువారం ఈ విగ్రహాన్ని గ్రామ బహుజన నాయకుడు దర్శనాల జంపన్న ఆధ్వర్యంలోని కమిటీకి అందించారు. ఆర్ట్స్ కళాశాల క్యాంటీన్‌లో ఎన్జీవో అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విగ్రహదాత డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ ఫ్యాకల్టీ సభ్యులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా విగ్రహాన్ని గ్రామ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ కొంగర వీరాస్వామి మాట్లాడుతూ పూలే విగ్రహాల స్థాపన ద్వారా బహుజన భావజాల వ్యాప్తికి కృషి జరగడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి, రచయిత డాక్టర్ మంథని శంకరయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పూలే, అంబేడ్కర్ భావజాల వ్యాప్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బీసీ సెల్ బాధ్యులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ కొర్ర రాజేందర్, గర్మిళ్లపల్లి గ్రామస్థుడు రియాజ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

మృతుల కుటుంబాలకు చల్లా ధర్మారెడ్డి పరామర్శ



అక్షరశక్తి, పరకాల: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల మున్సిపాలిటీలోని 2, 22వ వార్డులకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు బొచ్చు చిన్ని కృష్ణ తల్లి నర్సమ్మ, బొచ్చు అశోక్ (అయిలయ్య), తూముల సాంబయ్య ఇటీవల మృతి చెందడంతో వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కష్టసుఖాల్లో కార్యకర్తల కుటుంబాలకు తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

రంగమ్మ ప్రథమ వర్ధంతికి హాజరు

పరకాల సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి తల్లి రేగురి రంగమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోనూ చల్లా ధర్మారెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

ఆహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

ఘనంగా లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవం

అక్షరశక్తి, హైదరాబాద్ : ఆరోగ్యకరమైన ఆహారం, సహజ జీవన విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. లక్ష్మణ్ పూడి స్థాపించిన లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోందన్నారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార భద్రత ప్రమాణాలను పాటించకపోవడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. భావితరాలకు ఆస్తిపాస్తుల కంటే స్వచ్ఛమైన నీరు, కల్తీలేని ఆహారం అందించడం ముఖ్యమన్నారు. ముఖ్యంగా యువత పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం వ్యవస్థాపకుడు లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ.. పోషకాహారం, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. వ్యాధుల నివారణకు అవసరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రజాగాయని అరుణోదయ విమలక్క, సుమన్ టీవీ వ్యవస్థాపకుడు సుమన్ దూది, సినీ నటులు సప్తగిరి, కిరాక్ ఆర్పీ, ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




స్వీట్ల తయారీలో ఫేషియల్ రోజ్‌వాటర్!

- **వరంగల్, హనుమకొండలో టీజీ సేఫ్ ఆకస్మిక తనిఖీలు**
- **9 ఆహార తయారీ కేంద్రాల లైసెన్సులు సస్పెండ్.. యూనిట్ల మూసివేత**
- **కుళ్లిన బంగాళాదుంపలు, బూజుపట్టిన అల్లం..**
- **చక్కెర పాకంలో చనిపోయిన దోమలు**
- **రూ.5.41 లక్షల విలువైన 5,045 కిలోల ముడి సరుకు సీజ్**








అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 29 : ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన తయారీ కేంద్రాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వైనం వెలుగుచూసింది. స్వీట్ల తయారీలో ముఖానికి రాసుకునే ఫేషియల్ రోజ్‌వాటర్‌ను వినియోగించడం, చక్కెర పాకంలో చనిపోయిన దోమలు కనిపించడం, చిప్స్ తయారీకి కుళ్లిన బంగాళాదుంపలు ఉపయోగించడం వంటి తీవ్ర ఉల్లంఘనలను టీజీ సేఫ్ (తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత విభాగం) అధికారులు గుర్తించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని మిఠాయి, మసాలా, నూనె, ఐస్‌క్రీం, అల్లం వెల్లుల్లి పేస్టు, సోంపు తయారీ కేంద్రాలపై గురువారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి తొమ్మిది తయారీ కేంద్రాల లైసెన్సులను సస్పెండ్ చేసి, యూనిట్లను మూసివేశారు. మరో కేంద్రం లైసెన్సు సస్పెన్షన్‌కు సిఫార్సు చేయడంతో పాటు షోకాజ్, ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

10 బృందాలతో ఏకకాలంలో తనిఖీలు

టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మొత్తం 10 ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. వివిధ ఆహార తయారీ కేంద్రాల్లో ఉత్పత్తుల నాణ్యత, ముడి పదార్థాల నిల్వ, పరిశుభ్రత, ప్యాకేజింగ్, లైసెన్సులు, సిబ్బంది భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. పలు చోట్ల అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా లోపాలు, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.

కుళ్లిన ముడి పదార్థాలు.. అపరిశుభ్ర పరిసరాలు

స్వీట్ల తయారీలో వినియోగించేందుకు ఫేషియల్ రోజ్‌వాటర్‌ను నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. చిప్స్ తయారీ కోసం కుళ్లిపోయిన బంగాళాదుంపలు, బూజుపట్టిన అల్లం నిల్వ ఉంచినట్లు తనిఖీల్లో వెల్లడైంది. రూ.9,400 విలువైన గడువు ముగిసిన ఆహార పదార్థాలను గడువు ఉన్న వస్తువులతో కలిపి ఉంచినట్లు గుర్తించారు. ఒక సోంపు తయారీ కేంద్రంలో సరైన చిరునామా, వివరాలు లేని లేబుళ్లతో అనుమానాస్పదంగా ఉన్న 5,045 కిలోల ముడి సరుకును సీజ్ చేశారు. దీని విలువ రూ.5,41,150గా అధికారులు పేర్కొన్నారు. మిఠాయిల తయారీకి ఉపయోగించే చక్కెర పాకంలో చనిపోయిన దోమలు కనిపించగా, తయారీ కేంద్రంలో కుక్కలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. నీటి నిల్వ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటం, తయారీ కేంద్రాల పక్కనే దుర్వాసన వెదజల్లే ఓపెన్ డ్రైనేజీలు ఉండటం, వంటగది నేల జిడ్డుగా, జారిపోయేలా ఉండటాన్ని అధికారులు గుర్తించారు.

తుప్పపట్టిన యంత్రాలు.. తప్ప లేబుళ్లు

నూనె నిల్వ ట్యాంకులు, నూనె నింపేందుకు ఉపయోగించే ఇనుప టిన్లు, స్వీట్ల తయారీ యంత్రాలు తుప్పపట్టి, దుమ్ముతో నిండిపోయినట్లు తనిఖీల్లో వెల్లడైంది. విద్యుత్ కంట్రోల్ ప్యానెల్ బోర్డుల లోపల ముడి పదార్థాలను నిల్వ ఉంచడం, విద్యుత్ బోర్డులు తెరిచి ఉండటం, అగ్నిమాపక పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వంటి భద్రతా లోపాలను గుర్తించారు. ప్యాకేజింగ్ మెటీరియల్‌పై బ్రాండ్ పేర్లను తప్పుగా ముద్రించినట్లు గుర్తించి సుమారు 80 కిలోల తప్పుడు లేబులింగ్ మెటీరియల్‌ను ధ్వంసం చేశారు. ఆహార తయారీ సిబ్బందికి ఫుడ్ సేఫ్టీ (FoSTaC) శిక్షణ లేకపోవడం, మెడికల్ సర్టిఫికెట్లు, నీటి నాణ్యత పరీక్షల నివేదికలు, పెస్ట్ కంట్రోల్ రికార్డులు అందుబాటులో లేకపోవడం వంటి లోపాలనూ గుర్తించారు. సిబ్బంది కనీస రక్షణ దుస్తులైన ఆప్రాన్లు, గ్లౌజులు ధరించకపోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు.

తొమ్మిది లైసెన్సులు సస్పెండ్

తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనల నేపథ్యంలో తొమ్మిది తయారీ కేంద్రాల లైసెన్సులను సస్పెండ్ చేసి వాటిని మూసివేసినట్లు అధికారులు తెలిపారు. నాలుగు షోకాజ్ నోటీసులు, ఒక ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేశారు. సెంట్రల్ లైసెన్సు పరిధిలోని మరో తయారీ కేంద్రం లైసెన్సును సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు. అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, మిఠాయి, మసాలా తయారీ కేంద్రాల నిర్వాహకులు చెల్లుబాటయ్యే ఆహార భద్రతా లైసెన్సులను ప్రదర్శించాలని సూచించారు. పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ములుగు, జనగామ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 50 మంది సిబ్బంది ఈ ప్రత్యేక తనిఖీల్లో పాల్గొన్నట్లు అధికారులు వెల్లడించారు.

పేదల గుడిసెల కూల్చివేత దుర్మార్గం!

- **బాధితులకు అండగా నిలిచి పోరాడతాం**
- **వైఎస్సార్ నగర్ వాసులకు హాని జరిగితే ఎమ్మెల్యే నాయినిదే బాధ్యత**
- **భూమిపై కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్పష్టత ఇవ్వాలి**
- **బీజేపీ నాయకురాలు రావు పద్మారెడ్డి డిమాండ్**



అక్షరశక్తి, కాజీపేట: దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మారెడ్డి అన్నారు. కాజీపేటలోని వైఎస్సార్ నగర్‌లో గుడిసెల కూల్చివేతకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఆమె స్థానిక బీజేపీ నాయకులతో కలిసి గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. కూల్చివేతలను అడ్డుకునే క్రమంలో అక్కడున్న వారితో బీజేపీ నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

ఇళ్లలో లేని సమయంలో గుడిసెల కూల్చివేతలా?

వైఎస్సార్ నగర్‌లో సుమారు 20 ఏళ్లుగా నివాసముంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలను ఒక్కసారిగా ఆందోళనకు గురిచేయడం దారుణమని పద్మారెడ్డి అన్నారు. ఇంటి యజమానులు లేని సమయంలో బయట వ్యక్తులు వచ్చి గుడిసెలను కూల్చివేయడం అమానుషమని మండిపడ్డారు. అధికార, రాజకీయ అండదండలతోనే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికార యంత్రాంగం, పోలీసుల స్పందనపై ప్రశ్నలు లేవనెత్తారు.

అధికారులు స్పష్టత ఇవ్వాలి

వైఎస్సార్ నగర్‌లోని స్థలానికి సంబంధించిన వాస్తవాలను జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్పష్టం చేయాలని పద్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం వంటి ప్రజాప్రయోజనాలకే వినియోగించాలని సూచించారు. భూమి విషయంలో నెలకొన్న వివాదాన్ని అధికారులు పరిశీలించి, పేద కుటుంబాలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పునరావాసం, పరిహారం కల్పించాలి

గుడిసెల వాసులకు తక్షణమే పునరావాసం కల్పించి, తగిన పరిహారం అందించే వరకు బాధితుల పక్షాన నిలబడతామని పద్మారెడ్డి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ నగర్ నివాసులకు ఏ చిన్న హాని జరిగినా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిదే సంపూర్ణ బాధ్యత అని ఆమె డిమాండ్ చేశారు. పేదల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీకాంత్ పటేల్, మామిడాల నరేందర్, నర్సింగ్ గౌడ్, భగవాన్ ఉపాధ్యాయ, శ్రావణ్ యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, కళ్యాణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

వైద్యం.. వ్యాపారమా, ప్రజల హక్కా?



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

ఒకప్పుడు కుటుంబ వైద్యుడు చెప్పిన మాట రోగికి ధైర్యాన్నిచ్చేది. ఆయన సూచించిన మందుపై, చేసిన పరీక్షపై, ఇచ్చిన భరోసాపై కుటుంబానికి నమ్మకం ఉండేది. ఇప్పుడు చిన్న అనారోగ్యానికి ఆసుపత్రికి వెళితే వరుస పరీక్షలు, ఖరీదైన మందులు, అనేక మంది నిపుణుల సంప్రదింపులు, చివరకు భారీ బిల్లు. ఒక వైద్యుడి నిర్ధారణ సరిపోతుందా, మరో అభిప్రాయం తీసుకోవాలా, ఆపరేషన్ తప్పనిసరేనా అనే సందేహాలు రోగిని వెంటాడుతున్నాయి. ఆధునిక వైద్య పరిజ్ఞానం అద్భుతమైన ప్రాణరక్షక ఫలితాలను అందిస్తున్నప్పటికీ, అదే రంగంలో పెరుగుతున్న వాణిజ్య ధోరణులు వైద్యుడు-రోగి సంబంధాన్ని అనుమానాల బంధంగా మారుస్తున్నాయి. దీనికి బాధ్యత కొందరు వైద్యులదే కాదు; ప్రజారోగ్యాన్ని తగినంతగా బలోపేతం చేయని ప్రభుత్వాలది, పారదర్శకత లోపించిన ఆసుపత్రులది, రోగుల బలహీనతను లాభాల అవకాశంగా చూసే వ్యాపార వ్యవస్థలది కూడా. రూ.11,000కు లభించే క్యాన్సర్ ఇంజెక్షన్‌ను ఒక కార్పొరేట్ ఆసుపత్రి రూ.1.30 లక్షలకు విక్రయించిందన్న ఉదంతాన్ని 2026 అక్టోబరు 27న సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ప్రస్తావించింది. రూ.15కు లభించే డ్రిప్ లైన్‌కు రూ.250 వసూలు చేస్తున్నారన్న అంశాన్నీ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ధరల వ్యత్యాసాలను సమర్థించడానికి ఆసుపత్రుల నిర్వహణ ఖర్చులను చూపడం ఎంతవరకు సమంజసమని న్యాయమూర్తులు నిలదీశారు. అయితే ఇవి విచారణలో ప్రస్తావించిన ఉదంతాలు, ఆరోపణలు మాత్రమే; వీటిపై తుది న్యాయనిర్ణయం వెలువడిందని భావించకూడదు. అయినప్పటికీ, ప్రాణరక్షక మందుల ధరలపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇంత తీవ్రంగా ప్రశ్నించాల్సి రావడం వైద్యరంగ నియంత్రణలోని లోపాలను స్పష్టం చేస్తోంది.

భారతదేశంలో ఆరోగ్య సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవాలంటే వ్యాధుల స్వభావాన్ని పరిశీలించాలి. గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు దేశ ప్రజారోగ్యానికి ప్రధాన సవాళ్లు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, 2023లో భారతదేశ మరణాల్లో 71.1 శాతం అసంక్రమిత వ్యాధులకు సంబంధించినవే. గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, శ్వాసకోశ సమస్యలు, మధుమేహం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. క్షయ, ఇతర అంటువ్యాధులు, తల్లి-శిశు ఆరోగ్య సమస్యలు కూడా ప్రజారోగ్య వ్యవస్థపై భారాన్ని మోపుతున్నాయి. ఈ వ్యాధులకు దీర్ఘకాలిక చికిత్స అవసరమవుతుంది. అందువల్ల మందుల ధరలు, పరీక్షల ఖర్చులు, వైద్య సదుపాయాల లభ్యత కోట్లాది కుటుంబాల ఆర్థిక భద్రతను నిర్ణయిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యవ్యవస్థ బలంగా ఉండాలి. కానీ అనేక ప్రాంతాల్లో నిపుణుల కొరత, పరీక్షా పరికరాల లేమి, మందుల కొరత, పడకల కొరత, వైద్యులపై అధిక పనిభారం వంటి సమస్యలు రోగులను ప్రైవేట్ ఆసుపత్రులవైపు నెడుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన సదుపాయాలు అందుబాటులో ఉంటే ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతుంది. జాతీయ ఆరోగ్య ఖాతాల అంచనాల ప్రకారం, 2021-22లో భారతదేశ మొత్తం ఆరోగ్య వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 3.83 శాతం కాగా, ప్రభుత్వ ఆరోగ్య వ్యయం 1.84 శాతంగా ఉంది. కుటుంబాలు నేరుగా భరించిన ఆరోగ్య ఖర్చు మొత్తం ఆరోగ్య వ్యయంలో 39.4 శాతానికి చేరింది. జాతీయ ఆరోగ్య విధానం-2017 ప్రభుత్వ ఆరోగ్య వ్యయాన్ని స్థూల దేశీయోత్పత్తిలో 2.5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం కేవలం సంక్షేమ చర్య కాదు; ప్రజలు ప్రైవేట్ వైద్యంపై పూర్తిగా ఆధారపడకుండా చేసే ఆర్థిక రక్షణ కవచం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు సరిపోకపోవడాన్ని ప్రైవేట్ రంగం తన సేవల అవసరాన్ని సమర్థించడానికి ఉపయోగిస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు భవనాలు, పరికరాలు, నిపుణుల వేతనాలు, అత్యవసర సేవలు నిర్వహించడానికి భారీ ఖర్చులు ఉంటాయన్నది నిజం. కానీ ఆ ఖర్చుల పేరుతో ప్రతి మందుపై, ప్రతి వైద్య పరికరంపై అపరిమిత మార్జిన్లు విధించే హక్కు లేదు. మందుల కొనుగోలు ధర, రోగికి విధించే ధర, వైద్యుల ఫీజు, పరీక్షల ఖర్చు, ఆసుపత్రి సేవల ఛార్జీలను స్పష్టంగా ప్రతి ఆసుపత్రిలో విధిగా, పారదర్శకంగా పెద్ద బోర్డు పై మాతృభాషలో సైతం ప్రదర్శించి చూపించాలి. లాభం పొందడం వ్యాపార స్వభావం కావచ్చు; రోగి ప్రాణాపాయాన్ని ఆసరాగా చేసుకుని అతని ఆర్థిక బలహీనతను దోపిడీ చేయడం మాత్రం సమర్థనీయం కాదు. అనవసర పరీక్షలు ఈ వాణిజ్య ధోరణిలో మరో ఆందోళనకర అంశం. రక్తపరీక్షలు, స్కానింగ్, కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ), మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ), ట్యూమర్ మార్కర్ పరీక్షలు వంటి నిర్ధారణ పద్ధతులు అవసరమైనప్పుడు ప్రాణాలను కాపాడగలవు. కానీ ప్రతి పరీక్ష ప్రతి రోగికి అవసరం కాదు. అంతర్జాతీయ వైద్య పరిశోధనల సమీక్షలో 55 దేశాలకు సంబంధించిన 154 అధ్యయనాలను పరిశీలించగా, అనవసర నిర్ధారణలు, అధిక పరీక్షల వినియోగం విస్తృతంగా ఉన్నట్లు వెల్లడైంది. కొన్ని సందర్భాల్లో తక్కువ ప్రయోజనం కలిగిన పరీక్షలు అదనపు ఖర్చుతోపాటు తప్పుడు అనుమానాలు, మరిన్ని పరీక్షలు, అనవసర చికిత్సలకు దారితీస్తాయి.

ఒక ఉదాహరణ తీసుకుందాం. సాధారణ వెన్నునొప్పి ఉన్న ప్రతి వ్యక్తికీ వెంటనే ఎంఆర్ఐ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. వైద్య చరిత్ర, శారీరక పరీక్షల ఆధారంగా మొదట చికిత్స అందించవచ్చు; ప్రమాద సూచనలు ఉన్నప్పుడు మాత్రం ఆలస్యం చేయకుండా తగిన పరీక్షలు అవసరం. అలాగే ప్రతి జ్వరానికీ విస్తృత పరీక్షల ప్యాకేజీ, ప్రతి అలసటకూ అనేక రక్తపరీక్షలు, ప్రతి చిన్న లక్షణానికీ ఖరీదైన స్కానింగ్ చేయడం శాస్త్రీయ వైద్యానికి నిదర్శనం కాదు. అయితే ఏ పరీక్ష అవసరమో రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలను బట్టి వైద్యుడే నిర్ణయించాలి. పరీక్షలను తగ్గించాలనే పేరుతో అవసరమైన నిర్ధారణను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరమే.

లావు తగ్గడం, రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అంశాల్లోనూ ప్రజలను అనవసరంగా భయపెట్టే ధోరణి కనిపిస్తోందన్న విమర్శలను పరిశీలించాలి. ఆరోగ్యానికి సంబంధించిన ప్రమాణాలు మారుతున్నాయని, అంతర్జాతీయ సంస్థలు వేర్వేరు పరిమితులు సూచిస్తున్నాయని చెప్పి ప్రతి వైద్య నిర్ణయాన్నీ అనుమానించడం సరికాదు. శాస్త్రీయ ఆధారాలు, జనాభా లక్షణాలు, వయస్సు, ఇతర వ్యాధుల ప్రమాదం ఆధారంగా మార్గదర్శకాలు మారవచ్చు. ఉదాహరణకు, అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ మార్గదర్శకాల ప్రకారం ఉపవాస రక్తంలో గ్లూకోజ్ 126 మిల్లీగ్రాములు/డెసిలీటర్ లేదా అంతకంటే ఎక్కువగా ఉండటం, హెచ్‌బీఏ1సీ 6.5 శాతం లేదా అంతకంటే ఎక్కువగా ఉండటం మధుమేహ నిర్ధారణకు ఉపయోగించే ప్రమాణాలు. లక్షణాలు లేని వ్యక్తుల్లో నిర్ధారణను సాధారణంగా మరో పరీక్షతో నిర్ధారించాల్సి ఉంటుంది. ఆసియా సంతతి ప్రజల్లో మధుమేహ ప్రమాదాన్ని గుర్తించడానికి శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ) 23 నుంచే పరిశీలన అవసరమయ్యే పరిస్థితులున్నాయి. ఇవి ప్రజలను భయపెట్టడానికి రూపొందించిన సంఖ్యలు కావు; ప్రమాదాన్ని ముందుగా గుర్తించడానికి ఉపయోగించే మార్గదర్శకాలు.

అయితే ఒక పరీక్ష ఫలితం కొద్దిగా మారిందని వెంటనే ప్రాణాపాయం ఉందని చెప్పడం, ఖరీదైన చికిత్స లేదా మందులను తక్షణమే కొనాలని ఒత్తిడి చేయడం, జీవనశైలి మార్పులతో నియంత్రించగల పరిస్థితులకు కూడా అతిగా మందులు సూచించడం వంటి చర్యలు జరిగితే వాటిని ప్రశ్నించాలి. కొలెస్ట్రాల్‌కు మందు అవసరమా అనేది కేవలం ఒక సంఖ్య ఆధారంగా నిర్ణయించరు; గుండె జబ్బుల చరిత్ర, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల పనితీరు, మొత్తం హృదయ సంబంధ ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అధిక బరువున్న ప్రతి వ్యక్తికి ఒకే విధమైన చికిత్స సరిపోదు. కొందరికి ఆహార నియంత్రణ, వ్యాయామం, నిద్రలో మార్పులు సరిపోవచ్చు; మరికొందరికి వైద్య చికిత్స అవసరమవుతుంది. నిజమైన ప్రమాదాన్ని వివరించడం వైద్యుడి బాధ్యత; భయాన్ని సృష్టించి చికిత్సను విక్రయించడం మాత్రం వైద్య నైతికతకు విరుద్ధం.

ఒక ఆపరేషన్ సూచించినప్పుడు, ముఖ్యంగా అత్యవసర పరిస్థితి కానప్పుడు, మరో నిపుణుడి అభిప్రాయం తీసుకోవడం ఉపయోగకరమే. మొదటి వైద్యుడిని అవమానించడం కాదు ఇది; రోగి సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకునే హక్కును వినియోగించుకోవడమే. కానీ ప్రతి రిపోర్టుపై అనుమానం, ప్రతి ఆపరేషన్‌పై సందేహం, ప్రతి వైద్యుడిపై అపనమ్మకం పెరిగే పరిస్థితి కూడా ఆరోగ్య వ్యవస్థ వైఫల్యమే. వైద్యులు చికిత్సకు కారణం, ప్రత్యామ్నాయాలు, ప్రమాదాలు, ఖర్చులను వివరించాలి. రోగులు ప్రశ్నలు అడగడానికి భయపడకూడదు. వైద్యుడు-రోగి సంబంధం పరస్పర విశ్వాసం, గౌరవం, స్పష్టమైన సమాచారంపై నిలవాలి. ఔషధ కంపెనీలు వైద్యులను ప్రభావితం చేయడానికి బహుమతులు, పర్యటనలు లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నాయన్న ఆరోపణలు కూడా తీవ్రంగా పరిశీలించాల్సినవే. ఔషధ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యూనిఫాం కోడ్ ఫర్ ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్-2024 అనుచిత ప్రయోజనాలను నియంత్రించడానికి ఉద్దేశించింది. కానీ నియమావళి ఉండటం మాత్రమే సరిపోదు; ఉల్లంఘనలపై స్వతంత్ర విచారణ, పారదర్శక ప్రకటనలు, తగిన శిక్షలు అవసరం. అన్ని వైద్యులనూ లేదా అన్ని కంపెనీలనూ ఒకే విధంగా నిందించకుండా, నిర్దిష్ట ఆధారాలతో అక్రమ సంబంధాలను బయటపెట్టాలి.

విదేశాల్లో నిషేధించిన మందులు భారత్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలపైనా అప్రమత్తత అవసరం. ఒక దేశంలో నిషేధం విధించారనే కారణంతో ఆ మందు ప్రపంచవ్యాప్తంగా నిషేధితమని చెప్పలేం. అయినప్పటికీ, భద్రతా లోపాలు లేదా తీవ్రమైన దుష్ప్రభావాల కారణంగా ఇతర దేశాల నియంత్రణ సంస్థలు ఉపసంహరించిన మందులను భారత ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) తక్షణమే సమీక్షించాలి. 2026 జూన్‌లో శాస్త్రీయంగా సమర్థించలేని లేదా ఆరోగ్యానికి ప్రమాదకరమయ్యే 16 స్థిర మోతాదు ఔషధ కలయికలను నిషేధిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చర్య తీసుకుంది. ఇది సరైన దిశలో అడుగు. అయితే ఇప్పటికే మార్కెట్లో ఉన్న మందుల భద్రతను నిరంతరం పరిశీలించడం, దుష్ప్రభావాల సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే హెచ్చరికలు ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.

కేంద్ర ప్రభుత్వం ఔషధ ధరల జాతీయ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) అధికారాలను బలోపేతం చేయాలి. అవసరమైన మందుల ధరల నియంత్రణను విస్తరించడంతోపాటు ఆసుపత్రుల్లో విక్రయించే మందులు, వైద్య పరికరాలు, వినియోగ వస్తువులపై న్యాయమైన మార్జిన్ పరిమితులు విధించాలి. ఆసుపత్రుల ధరల పట్టికలు, పరీక్షల ఛార్జీలు, చికిత్స ప్యాకేజీలు బహిరంగంగా అందుబాటులో ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనవసర పరీక్షలు, తప్పుడు బిల్లులు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అనుచిత వైద్య ప్రవర్తనపై ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. వైద్య నిర్లక్ష్యం, ధరల దోపిడీ, నాణ్యత లోపాలపై స్వతంత్ర ఫిర్యాదు వ్యవస్థలు ఉండాలి. అదే సమయంలో ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయాలి. నిపుణుల కొరతను తగ్గించాలి. అవసరమైన మందులను ఉచితంగా అందించాలి, పరీక్షా సదుపాయాలను విస్తరించాలి. క్యాన్సర్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యలకు ప్రభుత్వ రంగంలో నిరంతర చికిత్స అందుబాటులో ఉండాలి. ఆరోగ్య బీమా పథకాలు ఆసుపత్రిలో చేరినప్పుడే కాకుండా, వ్యాధి ముందస్తు నిర్ధారణ, మందులు, తదుపరి చికిత్స ఖర్చులనూ తగినంతగా కవర్ చేయాలి. ప్రభుత్వ వైద్యవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగితేనే ప్రైవేట్ రంగంలో అన్యాయమైన ధరలపై ఒత్తిడి పెరుగుతుంది.

ప్రజలు కూడా వైద్యుల సూచనలను అర్థం చేసుకోవాలి, అవసరమైనప్పుడు రెండో అభిప్రాయం తీసుకోవాలి, మందుల బిల్లులు భద్రపరచాలి, చికిత్సకు ప్రత్యామ్నాయాలు అడగాలి. అయితే వైద్యుడి సలహా లేకుండా మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్ మందులను నిలిపివేయకూడదు; అవసరమైన పరీక్షలను భయంతో వాయిదా వేయకూడదు. ఔషధ ధరలను అధికారిక వేదికల్లో పోల్చుకోవాలి, అనుమానాస్పద మందులు లేదా తీవ్రమైన దుష్ప్రభావాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

వైద్య రంగం ప్రజల విశ్వాసంతోనే నిలబడుతుంది. వైద్యుడిని దేవుడిగా చూడాల్సిన అవసరం లేదు; అదే సమయంలో ప్రతి వైద్యుడినీ వ్యాపారిగా అనుమానించాల్సిన పరిస్థితి కూడా ఉండకూడదు. వైద్యులు నైతికతను, ఆసుపత్రులు పారదర్శకతను, ఔషధ కంపెనీలు బాధ్యతను, ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని తమ ప్రాధాన్యాలుగా స్వీకరించాలి. రోగి ప్రాణం ఒక వ్యాపార వస్తువు కాదు. ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి; ఆరోగ్యం సంపన్నుల ప్రత్యేక హక్కుగా, పేదలకు అప్పుల భారంగా మారకూడదు. ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థపై ప్రజలకే నమ్మకం లేకపోతే, అది కేవలం వైద్య రంగ సంక్షోభం కాదు—సామాజిక న్యాయానికి ఎదురైన తీవ్రమైన సవాలు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.